క్లుప్తంగా

సోయంగూడలో డ్రైడే

వాంకిడి: మండలంలోని సోయంగూడ గ్రామంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఈవో రవిదాస్ పర్యవేక్షణలో ఇంటింటికి దోమల మందు పిచికారీ చేశారు. గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వీధుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏ భగవాన్‌దాస్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం


సన్మానిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారులు చీఫ్ మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు, జీఎం (ఈఅండ్ఎం) ఎన్ నాగేశ్వర్‌రావులను శుక్రవారం బెల్లంపల్లి ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియా పర్యటనకు వచ్చిన వారిని గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్‌తో పాటు ఇతర విభాగాల ఉన్నతాధికారులు శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందచేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఓటూ జీఎం ఉమాకాంత్, పీవో సత్యనారాయణ, విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తులు


దరఖాస్తు చేసిన అనంతరం హుస్సేన్

కాగజ్‌నగర్‌టౌన్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేయడానికి ముగ్గురు అభ్యర్థులు వేర్వేరుగా దరఖాస్తులు అందజేశారు. సిర్పూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ తరఫున ఆయన కుమారుడు రావి శ్రీసాయిఓంకార్ దరఖాస్తు చేయగా, కాంగ్రెస్ నేత కోర్శ కృష్ణారెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు యూనుస్ హుస్సేన్ దరఖాస్తులు చేసుకున్నారు.

'ఉపాధి' పనుల్లో తేడాల్లేవు..


మాట్లాడుతున్న ఎంపీపీ పెందోర్ మోతిరాం

కెరమెరి: భారీ వర్షాలతో ఆ కాలంలో జరిగిన ఉపాధి హామీ పనుల కొలతల్లో తేడాలు వచ్చాయని, నిధుల దుర్వినియోగం జరగలేదని ఎంపీపీ పెందోర్ మోతిరాం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 1 జనవరి 2021 నుంచి 31-3-2023 వరకు జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన ప్రజావేదికల్లో సామాజిక తనిఖీ అధికారులు రూ.లక్షల్లో గోల్‌మాల్ అయినట్లు స్పష్టం చేశారని, కానీ ఆ కాలంలో భారీ వర్షాలతో మట్టి పనులు కూరుకుపోయాయని, అందుకే కొలతల్లో తేడాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ధనోరా ఉపసర్పంచ్ రిజ్వాన్ ఉన్నారు.

'బీసీలను రాజకీయంగా అణగదొక్కుతున్న పార్టీలు'


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రమేష్

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్రంలో బీసీలు రాజకీయంగా ఎదగకుండా అన్ని రాజకీయ పార్టీలు అణగదొక్కుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేష్ అన్నారు. బీసీల చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని వంకులంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ బీసీలపై సవితి తల్లి ప్రేమ చూపుతోందన్నారు. రాష్ట్ర జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు 1.6 కోట్ల ఓట్లు ఉంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 23 సీట్లు మాత్రమే కేటాయించి బీసీలు రాజకీయంగా ఎదగకుండా ప్రయత్నం చేసిందన్నారు. కేసీఆర్ రాష్ట్రంలో మహిళలకు 10శాతం రిజర్వేషన్ కూడా కల్పించకపోవటం పై ఎందుకు నోరు మెదపటం లేదని ప్రశ్నించారు. మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ కుమార్, రైతు అధ్యక్షుడు వైరగడే మారుతి, బీసీ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్, ప్రదీప్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతాలు


ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శిశుమందిర్‌లో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మహిళలు


రెబ్బెన: పూజలు చేస్తున్న ఎంపీపీ సౌందర్య


ఆసిఫాబాద్‌లోని మహాలక్ష్మీ ఆలయంలో..

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మహిళలు వరలక్ష్మీ వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పట్టణంలోని వాసవీ మందిరంలో అర్చకులు ముదిగొండ రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో వాసవీ మాతకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మహిళలు తమ ఇళ్లలోని పూజా మందిరాల్లో లక్ష్మీదేవికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళలు సామూహిక లలితా సహస్ర నామ పారాయణం చేశారు. పరస్పరం వాయినాలు ఇచ్చుకున్నారు. పట్టణంలోని మహాలక్ష్మీ ఆలయంలో అర్చకులు శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం, కానుకలు సమర్పించుకున్నారు. అర్చకులు మాట్లాడుతూ శ్రావణ మాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మీవ్రతంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. అమ్మవారి దీవెనలు ఉంటాయని తెలిపారు.

శిశుమందిర్‌లో

జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం జరుపుకున్నారు. అయ్యప్ప స్వామి ఆలయ అర్చకులు జంబోజు తిరుపతి చారి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పరస్పరం వాయినాలు ఇచ్చుకున్నారు. శిశుమందిర్‌లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మాతృమండలి సభ్యురాలు కల్లూరి వైష్ణవి, పాఠశాల ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్ రావు, ప్రతినిధులు బోగ మధూకర్, గుర్రాల హరిప్రియ, కల్లూరి సంతోశ్, శారద పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని గుట్టపై శ్రీకంకలమ్మ దేవి- కేతేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా అమ్మవారిని ఆలంకరించారు. మహిళలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య, తంగడిపెల్లి సంతోష్ పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఇళ్లలో వరలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించారు. అనంతరం నైవేద్యాలు పెట్టి వ్రతాన్ని కొనసాగించారు. మండలంలోని లగ్గాం ఉమాచంద్రశేఖర ఆలయంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని ప్రజలు శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.


దహెగాం: లగ్గాం శివాలయంలో..

లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఇంట్లో నిర్వహించిన వరలక్ష్మి వత్రం వేడుకలకు ఎంపీపీ జుమ్మిడి సౌందర్య హాజరై పూజలు చేశారు.


కౌటాల: ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కౌటాల: ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో వికలాంగులకు ఆసరా పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. వికలాంగులకు ప్రభుత్వం రూ.4016ను అందిస్తుందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కేవలం ఎన్నికల కోసం ప్రతిపక్ష పార్టీల హామీలను ప్రజలెవరూ నమ్మవద్దన్నారు. చింతలమానెపల్లి మండలంలోని దిందా గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అలాగే గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు ఎమ్మెల్యే కోనప్పను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, చింతలమానెపల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య, సర్పంచ్ వొజ్జల మౌనిక్, కోఆప్షన్ సభ్యులు అజ్మత్‌అలీ, ఎంపీడీవో నస్రూల్లా ఖాన్, పార్టీ మండలాధ్యక్షులు వసంత్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

కౌటాల: మండలంలోని ముత్తంపేట్ గ్రామంలోని నూతనంగా నిర్మించిన దేవాలయాల్లో ప్రతిష్టాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రత్యేక పూజలు చేశారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, సర్పంచ్ ఆదే శ్రీనివాస్, ఎంపీటీసీ దోని సురేఖ, పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిర్యాణి: మండలంలోని మారుమూల ప్రాంతంలోని గిరిజనులకు ఉచితంగా డిష్ టీవీ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు ఎస్సై చుంచు రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీవీలు ఉన్న ఆదివాసీలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

అభివృద్ధిని చూసే పార్టీలో చేరికలు

బెజ్జూర్: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసే ఆయా పార్టీలకు చెందిన నాయకులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కౌటాల మండల కేంద్రంలో బెజ్జూర్ మండలంలోని తుమ్మలగూడ గ్రామానికి చెందిన దాక మల్లయ్య, దాగం రుకుంబాయి, ఇప్ప శంకర్‌తో పాటు పలువురు గ్రామస్తులు మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. వెంకటి, మల్లయ్య ఉన్నారు.


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

ఎమ్మెల్యే కోనప్పకు సన్మానం

బీఆర్ఎస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోనేరు కోనప్పను సీఎం కేసీఆర్ ప్రకటించడంతో మండలం మర్థిడి గ్రామానికి చెందిన యాదవ సంఘం కాలనీవాసులు ఎమ్మెల్యే కోనేరు కోనప్పను ఘనంగా సన్మానించారు. శుక్రవారం కౌటాలలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో మర్థిడి యూత్ ధూపం శ్రీనివాస్, బీఆర్ఎస్‌వీ యూత్ అధ్యక్షుడు దూపం కిషన్, ధూపం సుధీర్, ముడుసు లింగయ్య, ఎర్ర తిరుపతి, సయ్యద్ మంజూర్, తదితరులు పాల్గొన్నారు.

కుమురంభీంకు నివాళి

కెరమెరి: మండలంలోని జోడేఘాట్ గ్రామాన్ని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్యాం నాయక్ సందర్శించాడు. భీం, కుమురం సూరు విగ్రహాలకు నివాళి అర్పించాడు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భీం చేసిన పోరాట మటిమ గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. సూరు చరిత్ర, భీంకు ఉన్న సంబంధం గురించి తెలుసుకున్నారు. నాయకులు కుసుంబ్‌రావు, రాము, రాజేశ్వర్ లున్నారు.


సమాధికి పుష్పాంజలి ఘటిస్తున్న శ్యాంనాయక్

క్యూఆర్ యాప్‌ను వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: డీడీస్ రోడ్ క్యూఆర్ యాప్‌ను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీటీవో లక్ష్మి, డిస్ట్రిబ్యూటర్ సతీష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీటీవో కార్యాలయంలో యాప్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ యాప్‌ను వాహనదారులు వినియోగిస్తున్నారని, దీంతో వాహనం పార్కింగ్ చేసే స్థలం తెలియజేస్తుందన్నారు. ఇన్సూరెన్స్, పొల్యూషన్, రీ రెన్యూవల్ వివరాలను తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. వాహనదారుడు గుర్తు తెలియనని ప్రదేశంలో ప్రమాదం సంభవిస్తే క్యూర్ కోడ్‌ను స్కాన్ చేస్తే వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం వెళ్తుందని తెలిపారు. 108కు సమాచారం ఇవ్వడంతో పాటు ప్రమాదం జరిగిన ప్రాంతానికి 20కిలో మీటర్ల దూరంలో ఉండే బ్లడ్ బ్యాంక్‌కు ఫోన్ వెళ్తుందని వివరించారు. వివరాలకు సెల్ నం.7702256344లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో అరుణాబాయి, ఎంవీఐ శ్రీకాంత్ చక్రవర్తి, జూనియర్ అసిస్టెంట్ వినీల్, రజిత, సంస్థ ప్రతినిధులు వెంకటేష్, లక్ష్మణ్, కాంతారావ్, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీటీవో

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన బీపీఏ జీఎం

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రవిప్రసాద్ శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోవలక్ష్మిని శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందచేశారు. సెప్టెంబర్ 14వ తేదీన నిర్వహించే డోర్లి ఓసీపీ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశానికి హాజరు కావాలని జీఎం కోరారు. జీఎం వెంట ఎస్టేట్స్ అధికారిణి నవనీత ఉన్నారు.


జెడ్పీ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న జీఎం

ఆయుర్వేద వైద్య శిబిరం

వాంకిడి: మండలంలోని లంజన్‌వీర గ్రామంలో ఆయుర్వేద వైద్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి గ్రామంలోని 56మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వాణి

బీపీ మండల్ జయంతి


చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీపీ మండల్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బీసీ సంఘ కార్యాలయంలో బీపీ మండల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూపనర్ రమేష్ మాట్లాడుతూ బీపీ మండల్ బీసీల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. ఆ సంఘం ప్రతినిధులు గాజుల జక్కయ్య, మిట్ట తిరుపతి, మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, ప్రణయ్‌కుమార్, ప్రశాంత్, సాయికృష్ణ ఉన్నారు.

రేపు హైదరాబాద్‌లో మున్నూరుకాపు ప్లీనరీ

ఆసిఫాబాద్: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ప్లీనరీ సమావేశం ఆదివారం ఉదయం 11.00 గంటలకు హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మిట్ట వెంకన్న తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అధ్యక్షతన జరిగే ప్లీనరీకి జిల్లాలోని మున్నూరు కాపు సంఘం నాయకులు అధిక సంఖ్యలో రావాలన్నారు.

బీఎస్పీ మండల కమిటీ ఎన్నిక



కౌటాల: బీఎస్పీ పార్టీ మండల నూతన కమిటీని శుక్రవారం కౌటాల బీఎస్పీ పార్టీ కార్యాలయంలో ఎన్నుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడిగా దుర్గం వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా బొమ్మకంటి ఆనంద్, పర్చాకే బండు, ప్రధాన కార్యదర్శి దాగం సంజు, కార్యదర్శులు పిడుగు ఎల్లయ్య, చునార్కర్ దీలిప్, కోశాధికారి దుర్గం సందీప్, జాడి సాయికృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి చందు, అధికార ప్రతినిధి రోహిని నానాజీ, బీవీఎఫ్ కన్వీనర్ మోతిరాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా నాయకులు రాంటెంకి నవీన్ పాల్గొన్నారు.

తుమ్మిడిహెట్టి వద్ద 'ప్రాణహిత' నిర్మిస్తాం

కౌటాల(సిర్పూర్): రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మిస్తామని మహారాష్ట్రలోని చిమూర్ ఎమ్మెల్యే బంటి భావు భాంగ్డియా అన్నారు. కౌటాల మండలం తుమ్మిడిహెట్టిలో శుక్రవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంతకు ముందు ప్రాణహిత నదికి హారతి ఇచ్చి పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. కౌటాలలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, జెండా ఎగురవేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు వానుపటేల్, ప్రధాన కార్యదర్శి మృత్యుంజయ్ కవిరాజ్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో సిర్పూర్(టి)

సిర్పూర్(టి): సిర్పూర్(టి) నియోజకవర్గ కేంద్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని మహారాష్ట్రలోని చిమూర్ ఎమ్మెల్యే బంటి భావు భాంగ్డియా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నారాయణ కళ్యాణ మండపంలో బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన సిర్పూర్(టి) మండల కేంద్రాన్ని చూస్తుంటే బాధగా ఉందన్నారు. బీజేపీ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, ఓబీసీ మోర్చా మహారాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజుభావు దేవతలే, మండల అధ్యక్షుడు ఎల్ములే శంకర్, ప్రధాన కార్యదర్శి రాచర్ల మహేష్, నాయకులు లావణ్య, ఎల్ములే మల్లయ్య, ప్రశాంత్ ఉన్నారు.


మాట్లాడుతున్న మహారాష్ట్ర ఎమ్మెల్యే బంటి

కలిసికట్టుగా ఉద్యమం

కెరమెరి: కలిసికట్టుగా ఉద్యమం చేసి సమస్యలు పరిష్కరించుకుంటామని మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మోడి కేజీబీవీలో సమగ్ర శిక్ష నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షురాలిగా పి.మీనా, గౌరవ అధ్యక్షురాలిగా డి.రక్షణ, ఉపాధ్యక్షుడిగా ఎం.మహేందర్, ప్రధాన కార్యదర్శిగా వై.అశ్విని, కార్యదర్శిగా శిరీష, భాగ్యలక్ష్మి, కోశాధికారిగా ఎం.వినోదా, న్యాయ సలహాదారులుగా జ్యోత్స్న, సభ్యులుగా పది మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రులు హరీషరావు, కేటీఆర్ తదితరులకు పోస్టు ద్వారా లేఖలు పంపించామన్నారు. రానున్న కాలంలో ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించక పోతే రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సమ్మె నిర్వహిస్తామన్నారు.


ఎన్నికైన సభ్యులు

పోరుగ్రామాల్లో ఎంపీపీ పర్యటన

కెరమెరి: కుమురంభీం పోరు గ్రామాలైన చిన్న పాట్నాపూర్, పెద్ద పాట్నాపూర్, బాబేఝరి, శివగూడ, జోడేఘాట్ గ్రామాల్లో శుక్రవారం ఎంపీపీ పెందోర్ మోతిరాం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జోడేఘాట్ శాటిలేట్ సెంటర్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు విధిగా పౌష్టికాహారం అందించాలని సూచించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. సర్పంచ్ సోని, బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్ ఉన్నారు.



చిన్నారులతో భోజనం చేస్తున్న ఎంపీపీ

ఈవీఎంలపై అవగాహన

దహెగాం: మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో శుక్రవారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కవిత మాట్లాడుతూ ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరు గురించి వివరించారు. ఓటరు ఓటు వేసిన తరువాత వీవీప్యాట్ డిస్‌ప్లేపై ఏడు సెకండ్ల పాటు కనిపిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఈవీఎంల ద్వారానే ఓటు హక్కు వినియోగించుకోనున్నందున ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు నాందేవ్, శృతి, ఏఎస్సై ప్రకాశ్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

హమాలీల కూలి పెంచాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్‌లో పనిచేస్తున్న హమాలీల కూలి రేట్లను పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులతో సీఐటీ యూ నాయకులు కూలి రేట్లను పెంచే విషయంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికుల కూలి పెంచాలని కోరారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఓదెలు, రాజేందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు